సాక్షి ఆదిలాబాద్

శనివారం । 16 । ఆగస్టు । 2025

గరిష్ఠం/కనిష్ఠం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్ప పీడన ప్రభావంతో పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.



పరేడ్ మైదానంలో జెండా ఎగురవేస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న షబ్బీర్ అలీ



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తూ..

ప్రగతి పథాన..

- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో జిల్లా ముందడుగు
- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
- భూభారతి ద్వారా భూ సమస్యలకు పరిష్కారం
- పంద్రాగస్టు వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో జిల్లా ప్రగతి పథంలో సాగుతుందని రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం జాతీయ జెండా ఆవిష్కరించారు. జాతీయగీతం ఆలపించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. 2035 నాటికి ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047' గా ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. ఇది కేవలం ప్రణాళిక కాకుండా, ప్రపంచ వేదికపై తెలంగాణను సగర్వంగా నిలబెట్టే సంకల్పమని స్పష్టం చేసిందని పేర్కొన్నారు. అలాగే ఆరు గ్యారెంటీ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం..

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఆడ బిడ్డలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందని అన్నారు. ఇప్పటివరకు 2.39 కోట్ల మహిళలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు.

పేదలకు సన్నబియ్యం పంపిణీ..

జిల్లాలో ఏప్రిల్ నుంచి 1.92 లక్షల ఆహార భద్రత కార్డుదారులకు సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 23,075 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. పాత కార్డుల్లో 31,319 మంది పేర్లను కొత్తగా చేర్చినట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500 గ్యాస్ సబ్సిడీ కింద 1.25 లక్షల మంది లబ్ధిదారులు అర్హులుగా ఉన్నారని తెలిపారు. ఇప్పటివరకు 4.33 లక్షల సిలిండర్లను సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. ఇందుకు గాను రూ.11.31 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు.



వేడుకల్లో పాల్గొన్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్, అధికారులు, తదితరులు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు..

ఇల్లు లేని నిరుపేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తుందని తెలిపారు. ప్రతీ నియోజకవర్గానికి తొలి విడతలో 3,500 ఇళ్లు మంజూరు చేశామని, జిల్లాలో 9,093 ఇండ్లు మంజూరు కాగా, 7134 మార్క్ అవుట్ చేసి 3,486 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు.

'గృహ జ్యోతి'తో వెలుగులు..

జిల్లాలో గృహజ్యోతి పథకంలో భాగంగా 1.02 లక్షల వినియోగదారులకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 16.78 లక్షల మందికి రూ.55.98 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 1290 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్లు తెలిపారు.

రైతు భరోసా..

రైతు భరోసా పథకం కింద వానాకాలం సీజన్‌లో 1.60 లక్షల మంది రైతులకు రూ.329.77 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. లక్ష మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచామని, ఇప్పటివరకు 74.266 మెట్రిక్ టన్నులు రైతులకు సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. జాతీయ ఆహార భద్రత పథకం కింద 3315 మంది రైతులకు 23.24లక్షల కంది, మినుములు, జొన్న కిట్లను వంద శాతం సబ్సిడీతో ఇచ్చినట్లు తెలిపారు.

వైద్య ఆరోగ్యసేవలు

ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. జిల్లాలో 25,051 మందికి వైద్యసేవలు అందించి రూ.60.89 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. కొత్త ఆసుపత్రులు, క్రిటికల్ కేర్ భవనాలు నిర్మించినట్లు వివరించారు.



నృత్య ప్రదర్శనలో విద్యార్థిని

కల్యాణలక్ష్మి..

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద ఇప్పటివరకు జిల్లాలో 40,103 కుటుంబా లకు రూ.373.88 కోట్ల చెక్కు అందించినట్లు తెలిపారు. ఒక్కో జంటకు రూ.1,00,116, దివ్యాంగుల జంటకు రూ.లక్ష 25వేల145 అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

పట్టణాభివృద్ధి..

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలకు రూ.10.50 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అమృత్ పథకం కింద రూ.95.50 కోట్లతో నీటి సరఫరా చేస్తున్నట్లు వివరించారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కోసం రూ.225.46 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

పంచాయతీరాజ్..

జిల్లాలో పీఎంజీఎస్‌వై కింద రూ.38.26 కోట్లతో రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రూ.25.37 కోట్ల తో ఏడు బ్రిడ్జి పనులు మంజూరు కాగా, ఆరు పూర్తయినట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద 71 అంగన్‌వాడీ సెంటర్ల నిర్మాణానికి రూ.8.52 కోట్లు, 105 గ్రామపంచాయతీల భవన నిర్మాణాని కి రూ.20.02 కోట్ల మంజూరైనట్లు పేర్కొన్నారు.

విద్యాపరంగా..

జిల్లాలో 694 ప్రభుత్వ పాఠశాలల్లో 57,481 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారని, బడిబాట కార్యక్రమంలో భాగంగా 1495 మందిని చేర్పించినట్లు తెలిపారు. పదో తరగతిలో 97.40 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో జిల్లా 9వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా 25,753 మందిని యాప్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా రూ.34.89 కోట్లతో మరమ్మతులు చేపట్టినట్లు వివరించారు.

ఉపకార వేతనాలు..

ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 226 మంది విద్యార్థులకు రూ.9.55 లక్షల పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ అందించినట్లు తెలిపారు. మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా ఓవర్సీస్ పథకం కింద విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న వారికి రూ.20 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఆరోగ్యలక్ష్మి పథకం కింద జిల్లాలో 10,483 మంది గర్భిణులు, బాలింతలకు ఒకపూట సంపూర్ణ పౌష్టికాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి..

భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి పోర్టల్‌పై జిల్లాలోని అన్ని మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి ఇప్పటివరకు 11,994 దరఖాస్తులు స్వీకరించి 2,897 ఆమోదించినట్లు తెలిపారు.

గ్రామీణాభివృద్ధి..

ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల ద్వారా 95,097 మంది విద్యార్థులకు యూనిఫాం కుట్టించినట్లు పేర్కొన్నారు. బ్యాంక్ లింకేజీ కింద 790 సంఘాలకు రూ.61.86 కోట్లు, శ్రీనిధి కింద 836 సంఘాలకు రూ.7.24 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు.

కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎంపీ గోడం నగేశ్, ఆదిలాబాద్, ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు, అనిల్ జాదవ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ఆదిలాబాద్: పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా పరేడ్ మైదానంలో ఆయా పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కేజీబీవీ ఆదిలాబాద్ అర్బన్ పాఠశాల బాలికలు తుఫాన్‌పై చేసిన డ్యాన్స్ ఆకట్టుకుంది. అలాగే గెజిటెడ్ నంబర్ వన్ ఆదిలాబాద్ పాఠశాల విద్యార్థులు మేరీ భారత్‌కీ భేటీ పాటపై నర్తించి అలరించారు. పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలో గల ఆశ్రమ హైస్కూల్ (బాలికల) విద్యార్థులు జిల్లా సంస్కృతికి అద్దం పట్టే గోండీ సాంప్రదాయ గీతంతో ఉర్రూతలూగించారు. మహాత్మ జ్యోతిబాపూలే (అనుకుంట) బాలికల పాఠశాల విద్యార్థులు ఆపరేషన్ సిందూర్ ఇతివృత్తంతో చేసిన నృత్య రూపకం దేశభక్తిని కళ్లకు కట్టింది. ఇక ఆదిలాబాద్ జూనియర్ కళాశాల కళాశాల విద్యార్థినులు అదే అంశంపై నర్తిస్తూ భళా అనిపించారు. పిరమిడ్ ప్రదర్శనకు ముగ్ధులైన ప్రభుత్వ సలహాదారు రూ.50వేల నగదు బహుమతి అందించడం విశేషం. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులందరికీ ప్రశంసాపత్రాలు అందించారు.



పశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో..



పిరమిడ్ ప్రదర్శనలో విద్యార్థులు





నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

న్యూస్‌రీల్

యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న సాధన సమితి సభ్యులు

ఆదిలాబాద్: జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని యూనివర్సిటీ సాధన సమితి సభ్యులు శుక్రవారం కలిసి విన్నవించారు. పంద్రాగస్టు వేడుకలకు హాజరైన ఆయనకు జిల్లా కేంద్రంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ప్రాంతవాసుల ఆకాంక్ష మేరకు జిల్లాలో విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన జిల్లాలో ఎక్కడ యూనివర్సిటీ కావాలని అడగగా, జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సైతం జిల్లా కేంద్రంలోనే అనువుగా ఉంటుందని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు సమితి కన్వీనర్ పురుషోత్తంరెడ్డి తెలిపారు. ఈ విషయమై సలహాదారు కలెక్టర్‌ను ఆరా తీయగా, విషయం తన దృష్టిలో ఉందని పేర్కొన్నారని సమితి సభ్యులు తెలిపారు. ఇందులో సమితి కోకన్వీనర్ తొగరి భాస్కర్, సవీన్‌రెడ్డి, డాక్టర్ నరేందర్‌రెడ్డి, సతీశ్ సతీశ్ రెడ్డి, ఆదినారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అసెంబ్లీలో ప్రస్తావించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తూ..

నేరడిగొండ: జిల్లాలో విశ్వ విద్యాలయం ఏర్పాటు అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఎస్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా చైర్మన్ రాథోడ్ సందీప్ విన్నవించారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో నేరడిగొండ మండల చైర్మన్ నర్సింగ్ దాస్, వైస్ చైర్మన్ సతీష్, కోఆర్డినేటర్ కృష్ణ, విలేజ్ కమ్యూనిటీ మెంబర్స్ కృష్ణ, సంతోష్ తదితరులున్నారు.

జిల్లా పోలీసులకు సేవా పతకాలు



సేవా పతకాలు అందుకుంటున్న కానిస్టేబుళ్లు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లకు రాష్ట్ర సేవా పతకాలు లభించాయి. టీజీ ఎఫ్‌టీఎఫ్ హెడ్‌క్వార్టర్స్ హైదరాబాద్‌లో పనిచేస్తున్న వీరు 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర హోం ప్రిన్సిపల్ సెక్రెటరీ రవిగుప్తా, డీజీ అనిల్ కుమార్ చేతుల మీదుగా ఈ పతకాలు అందుకున్నారు. జైనథ్ మండల కేంద్రానికి చెందిన కానిస్టేబుల్ కాయకార్ సంజయ్, ఆదిలాబాద్ పట్టణంలోని మోచిగల్లికి చెందిన గటిక రాజు పతకాలు అందుకోవడంపై పలువురు వారికి అభినందనలు తెలిపారు.

రైతుకు బీమా.. ధీమా

- ముగిసిన దరఖాస్తు గడువు
- జిల్లాలో కొత్తగా 3,188 మంది నమోదు

కైలాస్‌నగర్: అన్నదాత అకాల మరణంతో బాధిత కుటుంబం ఇబ్బందులు పడకుండా అండగా నిలువాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు బీమా పథకం అమలు చేస్తోంది. ఏదైనా ప్రమాదంలో, అనారోగ్యంతో, ఇతర ఏ కారణాలతో మృతి చెందినా ఆ కుటుంబానికి రూ.5లక్షల బీమా అందజేస్తోంది. 2018 ఆగస్టులో ప్రారంభించిన ఈ పథకం ద్వారా ఎన్నో రైతు కుటుంబాలు లబ్ధి పొందాయి. తాజాగా కొత్త పట్టా పాస్‌బుక్ పొందిన రైతులకు కూడా దీన్ని వర్తింపజేయాలని భావించిన ప్రభుత్వం దరఖాస్తుకు అవకాశం కల్పించింది. ఈ గడువు గురువారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 3,188 మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 1,15,666 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 59 ఏళ్లు పైబడిన 53,430 మందిని అనర్హులుగా గుర్తించారు. 2025 జూన్ 2వరకు కొత్తగా పట్టాపాస్‌బుక్ పొందిన రైతులను ఈ ఏడాది బీమా పథకానికి అర్హులుగా పరిగణించింది. వారి నుంచి ఈనెల 8నుంచి 14వరకు దరఖాస్తులు స్వీకరించింది. గురువారంతో గడువు ముగిసింది. జిల్లావ్యాప్తంగా 3,699 మంది కొత్తగా పట్టాపాస్ బుక్‌లు పొందగా 3188 మంది బీమా కోసం దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా బజార్‌హత్నూర్ మండలంలో దరఖాస్తు చేసుకోగా, అత్యల్పంగా ఆదిలాబాద్ అర్బన్ మండలంలో దరఖాస్తులు అందాయి.

725 కుటుంబాలకు సాయం..

ఈ పథకం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 783 మంది రైతులు వివిధ కారణాలతో మృతి చెందారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ సాయంగా రైతు మృతి చెందిన వారం నుంచి పది రోజుల్లోపు రూ.5లక్షలను అందజేస్తోంది. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 725 కుటుంబాలకు గాను రూ.36.25 కోట్ల ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న బీమా పథకం అన్నదాతల కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది.

జిల్లాలో రైతుబీమా పథకం వివరాలు

మండలాలు	21
మొత్తం రైతులు	1,68,108
గతంలో దరఖాస్తు చేసుకున్న వారు	1,15,666
కొత్తగా నమోదు చేసుకున్న రైతులు	3188



సాగుపనుల్లో నిమగ్నమైన అన్నదాత (ఫైల్)

మండలం	కొత్తగా పట్టాలు పొందిన రైతులు	దరఖాస్తు చేసుకున్న వారు
తలమడుగు	222	197
ఇంద్రవెల్లి	212	196
తాంసి	179	150
బజార్‌హత్నూర్	366	312
జైనథ్	261	223
సాత్నాల	79	73
గుడిహత్నూర్	179	155
భోరజ్	189	159
సొనాల	137	108
ఇచ్చోడ	206	184
ఉట్నూర్	213	177
నార్నూర్	81	73
ఆదిలాబాద్‌రూరల్	259	224
బోథ్	321	273
సిరికొండ	87	81
మావల	25	17
గాదిగూడ	67	47
నేరడిగొండ	187	167
ఆదిలాబాద్‌అర్బన్	30	10



కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మువ్వన్నెల రెపరెపలు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మువ్వన్నెలు రెపరెపలాడాయి. జిల్లా కోర్టులో జిల్లా జడ్జి ప్రభాకరరావు త్రివర్ణ పతాకం ఆవిష్కరించి జాతీయ గీతం ఆలపించారు. జడ్జీలు, న్యాయవాదులు పాల్గొన్నారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం, కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షిషా జాతీయ జెండా ఆవిష్కరించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీసు క్యాంప్ కార్యాలయంతో పాటు పోలీసు ముఖ్య కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

– ఆదిలాబాద్‌టౌన్



జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్



జాతీయ గీతం ఆలపిస్తున్న జిల్లా జడ్జి ప్రభాకరరావు

క్లుప్తంగా

దుర్గామాత ఆలయంలో చోరీ

మామడ: మండలంలోని పొన్కల్ దుర్గామాత ఆలయంలోని హుండీని శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆలయానికి వెళ్లిన భక్తులు గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వ్యాన్



స్తంభాన్ని ఢీకొట్టిన వాహనం

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోగల మసీదు ఎదురుగా నిర్మల్–ఖానాపూర్ ప్రధాన రహదారిపై ఉన్న సెంట్రల్ లైటింగ్ స్తంభాన్ని శుక్రవారం వేకువజామున నిర్మల్ నుంచి మెట్‌పల్లి వైపు అరటిపండ్ల లోడుతో వేగంగా వెళ్తున్న డీసీఎం వాహనం ఢీకొట్టింది. దీంతో గద్దె కూలి స్తంభం కిందపడింది. డీసీఎం వాహనం ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డు విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమంగా మద్యం విక్రయం.. ముగ్గురిపై కేసు

బోథ్: సొనాల మండల కేంద్రంలోని వైన్‌ షాప్ సమీపంలో శుక్రవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీసాయి పేర్కొన్నారు. పంద్రాగస్టు రోజున నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. 20 బీర్లు స్వాధీనం చేసుకుని సొనాలకు చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఉత్తములకు ప్రశంస



ప్రశంసాపత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఆదిలాబాద్: వివిధ శాఖల్లో నిబద్ధతగా వ్యవహరించి ఉత్తమ సేవలందించిన పలువురు అధికారులు, ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో మరింతగా రాణించి జిల్లా అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. అలాగే ఉత్తములుగా నిలిచిన విద్యాశాఖ ఉద్యోగులు, సిబ్బందిని షబ్బీర్ అలీ, కలెక్టర్ రాజర్షి షా అభినందించారు.



యువరాజ్ మర్మట్, ఉట్నూర్ సబ్‌కలెక్టర్



జేఆర్ చౌహాన్, ఎస్ఈ విద్యుత్‌శాఖ



జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్



రాజలింగు, డీబీసీడీఓ



కాజల్ సింగ్, ఏఎస్పీ, ఉట్నూర్



జీవన్‌రెడ్డి, డీఎస్పీ



సుధారాణి, డీఎం(సివిల్ సప్లై)



ఏ.శ్రీవల్లి, డీజీడబ్ల్యూవో



సీ. బసవేశ్వర్, పీడీ హౌసింగ్



గణేశ్ జాదవ్, డీఐఈవో



అవార్డు అందుకుంటున్న డాక్టర్ అనిల్ చిద్రాల



శ్రావణ్‌కుమార్, ఈ- పంచాయతీ జిల్లా మేనేజర్



రాథోడ్ విఠల్, ఈఈ ఇరిగేషన్



వై. హిమశ్రీ, డీపీఈవో



గజానంద్, డీఎంవో



ఎస్. ప్రవీణ్‌రెడ్డి, డీఎం మార్క్‌ఫెడ్



ఎం. మనోహర్‌రావు, ఈడీ ఎస్సీ కార్పొరేషన్



సునీతకుమారి, డీఎస్పీడీవో



ఎం.రాజేందర్, ఏడీ ఎస్‌అండ్‌ఎల్‌ఆర్



ఆర్. నరసింహారావ్, ఈఈ టీఎస్ఎంఎస్ఐడీసీ



ఎస్. శ్రీనివాస్, డీటీవో



డాక్టర్ వినీత్, డీసీవో, ఆరోగ్యశ్రీ



బీ.సునీల్ కుమార్, వన్‌టౌన్ సీఐ



బండి రవి, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్



రవీందర్, పీసీ



దేవిదాస్, పీసీ ట్రాఫిక్



అబ్దుల్ ముఖీం, రెవెన్యూ శాఖ



డాక్టర్ కార్తీక్, రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్



ఎం. జగదీష్, రెవెన్యూ

యశోద, ఐసీడీఎస్



విద్యాశాఖ ఉద్యోగులు, అధికారులను అభినందిస్తున్న షబ్బీర్ అలీ, కలెక్టర్

గిరిజనుల అభివృద్ధికి నిరంతర కృషి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో పంద్రాగస్టు వేడుకలు నిర్వహించారు. ముందుగా పీవో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ఐటీడీఏ ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఏజెన్సీ ప్రాంతంలో విద్య, వైద్యం, అభివృద్ధిపై దృష్టి సారించినట్లు చెప్పారు. 934 ప్రాథమిక పాఠశాలల్లో 12,017 మంది విద్యార్థులు చదువుతుండగా 1,449 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నట్లు తెలిపారు. 133 ఆశ్రమ పాఠశాలల్లో 31,749 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి పెంచిన చార్జీల ప్రకారం నూతన ఆహార మెనూ అమలు చేస్తూ నాణ్యమైన ఆహారం అందిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలో నాలుగు మినీ బాలికల గురుకులాలు, నాలుగు ఏకలవ్య పాఠశాలలు (కో–ఎడ్యుకేషన్), ఎనిమిది అప్‌గ్రేటెడ్ బాలికల జూనియర్ కళాశాలలు, నాలుగు అప్‌గ్రేటెడ్ జూనియర్ కళాశాలలు, ఒక బాలుర జూనియర్ కళాశాల, ఒక బాలికల జూనియర్ కళాశాల, రెండు మహిళా డిగ్రీ కళాశాలలు, ఒక పురుషుల డిగ్రీ కళాశాల ఉన్నట్లు తెలిపారు. గురుకులాల్లో 11,114 మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో 32 పీహెచ్‌సీలు, 186 ఆరోగ్య ఉప కేంద్రాలు, ఎనిమిది సామాజిక ఆరోగ్య కేంద్రాలుండగా వీటి ద్వారా గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. డయాలసిస్ సెంటర్ ద్వారా కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు 42 మందికి చికిత్స అందించినట్లు తెలిపారు. భూ బదలాయింపు చట్టం కింద ఈ సంవత్సరం 25 కేసులు నమోదు చేసి 12 పరిష్కరించినట్లు పేర్కొన్నారు. మిగతా 13 కేసులు విచారణలో ఉన్నట్లు తెలిపారు. జీసీసీ ద్వారా ఉమ్మడి జిల్లాలో గిరిజన సహకార సంస్థ, ఐటీడీఏ ఆధ్వర్యంలో 17 పెట్రోల్ పంపులు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపగా, మంజూరైన 11 పెట్రోల్ పంపులను ప్రారంభించి నిరుద్యోగ గిరిజన యువతీయువకులకు ఉపాధి కల్పించినట్లు పేర్కొన్నారు. మిగతా ఆరు పంపులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఏపీవో దామోదరస్వామి, ఏడీఎంహెచ్‌వో మనోహర్, పీహెచ్‌వో సందీప్, పీవీటీజీ ఏపీవో మనోహర్, డీపీవో ప్రవీణ్, అధికారులు, సిబ్బంది, ఆశ్రమ, గురుకుల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జెండాకు వందనం చేస్తున్న పీవో ఖుష్బూ గుప్తా. ఎమ్మెల్యే బొజ్జు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నిందితుడి ఆచూకీ తెలిపితే నజరానా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 8న ఓ వృద్ధురాలిపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి భారీ నగదు బహుమతి ఇస్తామని డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వన్‌టౌన్, టూటౌన్ సీఐలు సునీల్‌కుమార్, నాగరాజుతో కలిసి ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. వృద్ధురాలిపై లైంగికదాడికి పాల్పడి ఆమె మృతి కారణమైన నిందితుడు స్థానిక రైల్వేస్టేషన్ గుండా పర్లి వైద్యనాథ్ ట్రైన్‌లో పరారైన విషయం సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించినట్లు తెలిపారు. నిందితుడి ఎత్తు దాదాపు 5.4 అడుగులు ఉంటుందని, మరాఠీ భాష మాట్లాడే వ్యక్తిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. నిందితుడి వివరాలు తెలిస్తే ఆదిలాబాద్ డీఎస్పీని 87126 59914, ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐని 87126 59918, టూ టౌన్ సీఐని 8712659920, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌ను 87126 59965 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సమాచారం తెలిపినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. నిందితుడిని పట్టుకోవడానికి ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహారాష్ట్ర, తెలంగాణలలో గాలింపు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరలో నిందితుడిని పట్టుకుంటామని పేర్కొన్నారు. రూరల్ ఎస్సై విష్ణువర్ధన్, సిబ్బంది ఉన్నారు.



సీసీ కెమెరాకు చిక్కిన నిందితుడి చిత్రం

రాజీవ్ సద్భావన యాత్రకు వీడ్కోలు

కైలాస్‌నగర్: రాజీవ్ సద్భావన యాత్ర ఆదిలాబాద్ జిల్లాలో ముగిసింది. రాజీవ్ జ్యోతి యాత్ర చైర్మన్ ఆర్.దొరై ఆధ్వర్యంలో ఈ నెల 9న తమిళనాడులోని పెరంబుదూర్‌లో మొదలైన యాత్ర ఈనెల 19న దేశ రాజధానిలోని న్యూఢిల్లీలోని రాజీవ్‌గాంధీ సమాధి వీర్ భూమికి చేరుకుంటుంది. ఈ యాత్ర గురువారం రాత్రి ఆదిలాబాద్ పట్టణానికి చేరుకుంది. కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో యాత్రికులు రాత్రి బస చేశారు. శుక్రవారం ఉదయం క్యాంపు ఆఫీస్ ఆవరణలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. వారికి మాజీ ఎంపీ సోయం బాపూరావు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు జ్యోతిని దర్శించుకుని వీడ్కోలు పలికారు. 33 ఏళ్లుగా యాత్ర కొనసాగించడం అభినందనీయమని సోయం బాపూరావు కొనియాడారు. నాయకులు పాల్గొన్నారు.



రాజీవ్ జ్యోతితో బాపూరావు, నాయకులు

సైగలతో నృత్యం చేసి.. అందరి మెప్పు పొంది..

ఉట్నూర్‌రూరల్: వైకల్యమున్నా తాము అనుకుంటే సాధించలేనిదంటూ ఏమీ లేదని నిరూపించారు దివ్యాంగ విద్యార్థులు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఐటీడీఏ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో వికాసం ప్రత్యేక బాలబడి విద్యార్థులు డ్యాన్స్ ఉపాధ్యాయుడు చేస్తున్న సైగలను చూసి వేస్తున్న స్టెప్పులు అందరినీ అలరించాయి. అధికారులు, విద్యార్థుల కేరింతలతో ఐటీడీఏ ప్రాంగణం హోరెత్తింది. సదరు ఉపాధ్యాయుడు, విద్యార్థులను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పీవో ఖుష్బూ గుప్తా అభినందించారు.



సైగలు చూస్తూ నృత్యం చేస్తున్న విద్యార్థులు

చికిత్స పొందుతూ యువతి మృతి

నిర్మల్ రూరల్: మండలంలోని చిట్యాల గ్రామం వద్ద రాఖీ పండుగ రోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ అర్చన (18) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. లోకేశ్వరం మండలం రాయపూర్ కాండ్లికి చెందిన మహేశ్ వరుసకు చెల్లెళ్లయిన అర్చన, ఆద్యతో కలిసి జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న అర్చన చెల్లెలు అక్షయతో రాఖీ కట్టుకునేందుకు బైక్‌పై బయలుదేరారు. చిట్యాల వద్దకు రాగానే వేగంగా వెళ్తున్న గుర్తుతెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో మహేశ్, ఆద్యకు స్వల్ప గాయాలు కాగా.. అర్చనకు తీవ్రగాయాలయ్యాయి. అర్చన జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అర్చన ఇంటర్ పూర్తి చేసి ఇటీవలే హైదరాబాద్‌లో బీటెక్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందింది. మరో వారంరోజుల్లో కాలేజీలో జాయిన్ కావాల్సి ఉండగా రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, ప్రమాదానికి కారణమైన వాహనం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలానికి చెందిన ఓ వ్యక్తిదిగా రూరల్ పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. వాహనాన్ని స్వాధీనం చేసుకుని రవాణాశాఖ అధికారికి అప్పగించి దర్యాప్తు చేస్తున్నారు.



అర్చన (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణాపూర్‌కు చెందిన కుక్కల రాకేశ్ (21) ఇద్దరు స్నేహితులతో కలిసి నిజామాబాద్‌కు వెళ్లి తిరిగి రామకృష్ణాపూర్‌కు కారులో వస్తుండగా హాజీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేంపల్లి శివారులోగల కల్వర్టును అతివేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాకేశ్‌కు తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి వివాహం కాలేదు. అతని తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాటాగూడలో తొలిసారి ఎగిరిన జెండా

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని పాటాగూడ గ్రామంలో తొలిసారి జాతీయ జెండా రెపరెపలాడింది. ఇది మారుమూల గ్రామం కావడంతో ఎలాంటి రవాణా సౌకర్యం లేదు. జోడేఘాట్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలోని మారుమూల ప్రాంతంలో ఉంటుంది. అప్పుడప్పుడు ప్రైవేట్ వాహనాలు వెళ్తుంటాయి. అవి కూడా వెళ్లని పక్షంలో వారికి కాలినడకే శరణ్యం. ఆ గ్రామంలో ఇప్పటివరకు బడి, అంగన్‌వాడీ కేంద్రం లేదు. దీంతో ఇప్పటివరకు జెండా ఎగురవేయలేదు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా చొరవతో ఇటీవల గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాల ప్రారంభించారు. ఇందులో 14 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. శుక్రవారం పాఠశాలలో సీఆర్టీ చంద్రకళ త్రివర్ణపతాకం ఎగురవేశారు. దీంతో గిరిజనులు హర్షం వ్యక్తంజేశారు.

అధిక ధరకు మద్యం విక్రయించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: వైన్‌షాపు నుంచి తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్న భుక్తాపూర్‌కు చెందిన అల్లకుంట శివలు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. భుక్తాపూర్ ప్రాంతంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తూ అమాయక ప్రజలకు అధిక ధరలకు విక్రయిస్తుండగా శుక్రవారం పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతడి నుంచి రూ.1,070 విలువైన 1.62 లీటర్ల మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ముగ్గురు నిందితుల రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: రాగి తీగ చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. వన్‌టౌన్ ఎస్సై రమ్య శుక్రవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు రాగి తీగలతో ఉన్న సంచులు పట్టుకుని వెళ్తున్నారు. అనుమానం వచ్చిన ఎస్సై సంచులను పరిశీలించగా అందులో రాగి తీగలు లభించాయి. మహారాష్ట్రకు చెందిన దేవిదాస్, ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని లాండసాంగ్వికి చెందిన రాజేశ్వర్, శివాజీపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పంజేషా మొహల్లాకు చెందిన 18 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. గురువారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. చుట్టుపక్కలా గాలించినా ఆచూకీ లభించకపోవడంతో యువతి బాబాయి అజరుల్లా హాక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

భార్యతో గొడవపడ్డందుకు చితకబాదిన ఎస్సై!

- ఉన్నతాధికారులకు బాధితుడి ఫిర్యాదు

వేమనపల్లి: భార్యతో గొడవపడ్డందుకు తనను ఎస్సై చితకబాదాడని మండలంలోని సుంపుటం గ్రామానికి చెందిన అల్గం కిష్టయ్య ఆరోపించాడు. ఈ మేరకు ఎస్సైపై ఆరే కుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేశంతో కలిసి సీపీ, డీసీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సుంపుటం గ్రామానికి చెందిన అల్గం కిష్టయ్య నాలుగేళ్ల క్రితం నీల్వాయి కొత్త కాలనీకి చెందిన భారత ప్రమీలను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో ప్రమీల పుట్టింటికి వెళ్లడం, గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించిన అనంతరం తిరిగి కాపురానికి రావడం జరుగుతుండేది. 20 రోజుల క్రితం అనారోగ్యంతో ప్రమీల పుట్టింటికి వెళ్లింది. దీంతో కిష్టయ్య గత ఆదివారం ఆమె వద్దకు వెళ్లి కాపురానికి రావాలని గొడవ పడ్డాడు. దీంతో ప్రమీలతోపాటు ఆమె తల్లిదండ్రులు నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై సురేశ్ భార్యాభర్తలకు కౌన్సిలింగ్ చేశాడు. అయితే గ్రామానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేశ్ ద్వారా రూ.10వేలు ఇవ్వాలని ఎస్సై తనను డిమాండ్ చేసినట్లు కిష్టయ్య ఆరోపించాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో తన భార్య, అత్తమామలు, మరికొందరి ముందే ఎస్సై తనను రోకలిబండతో తీవ్రంగా కొట్టాడని కన్నీటిపర్యంతమయ్యాడు. ఈ విషయమై మూడురోజుల క్రితం రూరల్ సీఐ బన్సీలాల్, ఏసీపీ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. శుక్రవారం రామగుండం సీపీ, మంచిర్యాల డీసీపీకి పోస్టు ద్వారా ఫిర్యాదు కాపీ పంపించినట్లు పేర్కొన్నాడు. ఎస్సై సురేశ్‌తో తనకు ప్రాణహాని ఉందని వాపోయాడు. తనపై విచక్షణారహితంగా దాడికి పాల్పడిన ఎస్సైతోపాటు ఇద్దరు కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.



బాధితుడు కిష్టయ్య

'హమాలీల సమస్యలు పరిష్కరిస్తా'

బెల్లంపల్లి: హమాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. శుక్రవారం బెల్లంపల్లిలోని అగర్వాల్ భవన్‌లో తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహాసభ నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హమాలీ సంఘం నాయకులను సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకువెళ్లి సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంటి సామ్రాజ్యం మాట్లాడుతూ.. హమాలీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అసంఘటిత కార్మికుల మాదిరిగానే పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు బజారు ఏరియా ప్రాంతం నుంచి పుర వీధుల మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గెల్లి రాజలింగు, నియోజకవర్గ అధ్యక్షులు, హమాలీలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్